ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం అక్టోబరు 14, 2024



కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం

అశ్వ వాహనంపై జొన్నవాడ కామాక్షితాయి

ఉత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న రాజరాజేశ్వరి

అమ్మ శోభిల్లి.. భక్తులు ప్రణమిల్లి..

జిల్లాలో శనివారం విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి మహాభిషేకాలు నిర్వహించారు. నగరోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి నగరోత్సవం సందడిగా సాగింది.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

నెల్లూరు మూలాపేట భువనేశ్వరి అమ్మవారి శమీపూజ ఉత్సవం

పల్లె పండగ.. అభివృద్ధి మెండుగా..

నేటి నుంచి జిల్లాలో ప్రగతి పనులకు శంకుస్థాపన

ఈనాడు, నెల్లూరు: న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

సమగ్ర గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ఈనెల 14 నుంచి పల్లె పండగ కార్యక్రమం ప్రారంభం కానుంది. వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆగస్టు 23న పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదం పొందిన కీలక పనులు ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టింది. ఈనెల 14 నుంచి 21 వరకు పల్లె పండగ పేరుతో జిల్లాలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులను నిర్మాణాలకు వినియోగించనున్నారు. దీనికి అదనంగా 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నారు. జిల్లాలోని ఏడు(నెల్లూరు నగరం మినహా) నియోజకవర్గాలతో పాటు.. వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 965 పనులకు రూ.55.69 కోట్లు కలెక్టర్ ఆమోదం తెలిపారు. పనులు చేపట్టే గ్రామాల్లో సభలు నిర్వహించి, ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయనున్నారు. ఇతర శాఖల నుంచి వివిధ పనులకు మంజూరైన నిధులతో కొన్ని పనులు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



వలేటివారిపాలెంలో అభివృద్ధికి దూరంగా రోడ్డు

ఇదీ ప్రణాళిక...

కోవూరు నియోజకవర్గంలో 87 పనులకు రూ.2.86 కోట్లు, నెల్లూరు-1లో 51కి రూ.3.54 కోట్లు, నెల్లూరు-2లో 78 పనులకు రూ.3.96 కోట్లు, రాపూరులో 113 పనులకు రూ.6.68 కోట్లు, కందుకూరులో 187 పను లకు రూ.14.82 కోట్లు, కావలిలో 116 పనులకు రూ.4.55 కోట్లు, ఉదయగిరిలో 333 పనులకు రూ.19.26 కోట్లు మంజూరయ్యాయి.

జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి

పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేశామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కడా లోపాలు లేకుండా పనులు పూర్తి చేస్తామన్నారు.




మృత్యుమార్గాలు

కలవరపెడుతున్న రోడ్డు ప్రమాదాలు

చోదకుల నిర్లక్ష్యంతోనే మృత్యువాత

ఈనాడు, నెల్లూరు

గత మూడేళ్లలో.!



ప్రమాదాలు ■ మృతులు ■ క్షతగాత్రులు ■

● సరిగ్గా ఏడాది క్రితం కావలి సమీపంలో రోడ్డుపై ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి పండగకు నెల్లూరుకు వస్తున్న ఓ కుటుంబం ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. దూర ప్రాంతం నుంచి ప్రయాణం చేయడం, చోదకుడికి విశ్రాంతి లేకపోవడం, నిద్రమత్తుకు అతివేగం తోడైంది. మరో వాహనచోదకుడు తన లారీని రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలపడం, దానికి ఎలాంటి సిగ్నల్ లేపోవడం ప్రమాదానికి మరో కారణమైంది. ఈ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.

● ప్రతి ప్రమాదానికి ఏదో ఒక కారణం ఉంటోంది. దీనికి రోడ్డు నిర్మాణం సక్రమంగా లేకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, బ్లాక్‌స్పాట్‌లలో హెచ్చరిక బోర్డులో లేకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయని అధికారులు గుర్తించారు. జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా జిల్లాలో కేవలం 9 నెలల్లో 637 ప్రమాదాలు జరగ్గా. . 350 మంది మృత్యువాత పడ్డారు.

'జిల్లాలో ఈ ఏడాది 350 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. నివారణకు రవాణాశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా. ప్రమాదాలకు కారణాలు క్షుణ్నంగా తెలుసుకుని భవిష్యత్తులో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి' అంటూ ఇటీవల జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



గత మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే.. సగటున రోజుకు రెండు జరుగుతుండగా.. ఒకరు మృత్యువాత పడుతున్నారు. 2022 జనవరి నుంచి 2024 సెప్టెంబరు వరకు జిల్లాలో 2,425 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. వీటిలో 1083 తీవ్రమైనవి కాగా. . మిగిలినవి తీవ్రత తక్కువగా ఉన్నాయి. వీటిలో సుమారు 1,163 మంది చనిపోగా.. 2,748 మందికి గాయాలయ్యాయి. వీటిలో ఎక్కువగా ఎన్‌హెచ్-16(కోల్‌కతా- చెన్నై) రహదారిపై జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 167 ప్రమాదాలు జరగ్గా.. 124 మంది చనిపోయారు. ఆ తర్వాత ఎన్‌హెచ్-67(కృష్ణపట్నం-బద్వేల్) రోడ్డులో జరుగుతున్నాయి. రాష్ట్ర, ఇతర రహదారుల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి.

చిన్న వాహనాల చోదకులతో..

ప్రయాణం చేస్తున్నంత సేపు సాఫీగా సాగితే బాగానే ఉంటుంది. కాస్త ఏమరపాటు.. అజాగ్రత్త కారణంగా సుఖ సంతోషాలతో ఉండాల్సిన ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. జరిగిన రోడ్డు ప్రమాదాలను నిశితంగా గమనిస్తే చాలా ప్రమాదాలు చిన్న వాహన చోదకుల నిర్లక్ష్యం వల్లే జరిగాయని తెలుస్తోంది. పెద్ద వాహనాల డ్రైవర్ల తప్పిదాలు కనిపిస్తున్నాయి. దసరా పండగకు వాహనాలు పట్టణాల నుంచి పల్లెలకు వచ్చి తిరిగి వెళుతున్నాయి. కుటుంబసమేతంగా వెళుతున్నారు. ఇప్పటికే రోడ్లన్నీ వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం రద్దీ దృష్ట్యా నిబంధనలు పాటిస్తూ, సురక్షితంగా గమ్యం చేరాలి. ప్రమాదాల నివారణకు రవాణా, పోలీస్ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రహదారుల వారీగా(2024లో సెప్టెంబరు వరకు)..

రహదారి	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఎన్‌హెచ్–16	167	124	212
ఎన్‌హెచ్–67	88	41	89
ఎన్‌హెచ్–565	29	20	29
ఎన్‌హెచ్–167బీజీ	12	7	6
ఎన్‌హెచ్–167బీ	6	2	6
ఎస్‌హెచ్	124	64	136
ఇతర	211	92	200

ఎన్‌హెచ్: జాతీయ రహదారి ⁝ ఎస్‌హెచ్: రాష్ట్ర రహదారి

మూడు రోజులు భారీ వర్షాలు

అధికారుల అప్రమత్తం

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంత మండలాల అధికారులను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని దండోరా వేయించారు. వెళ్లిన వారిని తిరిగి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటుచేయాలని ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులకు సెలవులు రద్దు చేశారు. హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని నిర్దేశించారు.

పెన్నా ప్రాంతంలో ముందస్తు చర్యలు

బలహీనంగా ఉన్న, గండ్లు పడే అవకాశం ఉన్న పెన్నా నది గట్లను పరిశీలించాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, పూరిళ్లలో ఉండే వారిని పక్కా భవనాలు, తుపాను షెల్టర్లకు వెళ్లేలా అప్రమత్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటుచేశారు. 0861-2331261, 7995576699, 1077 నంబర్లు నిరంతరం పని చేసేలా ఏర్పాటు చేసి మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటుచేశారు.

మండలానికో అధికారి నియామకం

మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. సోమశిల జలాశయం నీటి మట్టాలను తెలుసుకుంటూ పెన్నా నదికి వరద వస్తే నది పరీవాహక ప్రాంతంలో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆత్మకూరు ఆర్డీవో, ఆయా ప్రాంతాల మండల అధికారులకు సూచించారు. బోట్లు, పొక్లెయిన్లు సిద్ధం చేస్తున్నారు. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, పాలు, కూరగాయలు, వాహనాలు, డీజిల్ సిద్ధంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఆసుపత్రుల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ, విద్యుత్తు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో పాటు ఇతర అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

పట్టాలపై జీపీఆర్ ప్రత్యేక రైలు

— భద్రత, వేగంగా వెళ్లేందుకు రైల్వేశాఖ చర్యలు —

బిట్రగుంట, న్యూస్‌టుడే: రైలు భద్రత, వేగంగా వెళ్లేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకుంది. తాజాగా ట్రాక్, సాయిల్ సామర్థ్యాలను గుర్తించేందుకు జీపీఆర్(గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సిస్టమ్) ప్రత్యేక రైలును పట్టాలెక్కించింది. రష్యాకు చెందిన సాంకేతిక బృందం పనులను పర్యవేక్షిస్తోంది. బిట్రగుంట వేదికగా చేపట్టిన వినూత్న ప్రయోగం భారతీయ రైల్వేలోనే ప్రథమమని తెలిసింది. ఆదివారం బిట్రగుంట- తలమంచి రైల్వేస్టేషన్ల మధ్య జీపీఆర్ ప్రత్యేక రైలు పట్టాలపై పరుగులు తీసింది. సేకరించిన సమాచారం మేరకు.. విజయవాడ- చెన్నై మధ్య రైలు మార్గాలు రవాణా వ్యవస్థకు అత్యంత కీలకం. రైల్వేకి లాభాలు కూడా తెచ్చిపెడుతున్నాయి. రైళ్ల రద్దీ ప్రభావంతో సకాలంలో గమ్యానికి చేర్చలేకపోతున్నామన్న కారణంగా నాల్గో లైను ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ పడింది. ఈ నేపథ్యంలో రైళ్ల భద్రత, ట్రాక్ సామర్థ్యం గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జీపీఆర్ ప్రత్యేక రైలును రంగంలోకి దింపింది. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరికరం ఉన్న ఈ ప్రత్యేక రైలు పట్టాలపై పరుగులు తీస్తుండగానే.. ట్రాక్ అడుగున ఉన్న నేల(సాయిల్) సామర్థ్యం, కంకర ఎన్ని మీటర్లు ఎత్తు ఉంది, అందులో దెబ్బతిన్న కంకర శాతం ఎంత? తదితర సాంకేతిక అంశాలను గుర్తించి జీపీఆర్ సిస్టమ్ నమోదు చేసుకుంటుంది. దీన్ని పర్యవేక్షించిన రష్యా సాంకేతిక బృందం గుర్తించిన అంశాలపై రైల్వేశాఖకు నివేదిక అందించనుంది. ప్రస్తుతం 90-110 కి.మీ. వేగంతో వెళుతున్న రైళ్లను 130 కి.మీ. వరకు వేగాన్ని పెంచేలా రూపుదిద్దే కార్యక్రమాలు ఉన్నట్లు తెలిసింది.



జీపీఆర్ ప్రత్యేక రైలు బోగి (వృత్తంలో జీపీఎస్ పరికరం)

మత్స్యకారులకు మహర్దశే

పనులు పూర్తయితే..



బోట్లు ఆగేది ఈ జెట్టి వద్దే

న్యూస్‌టుడే, బిట్రగుంట

మత్స్యకారుల కోసం జువ్వలదిన్నెలో ఏర్పాటు చేసిన చేపలరేవు చివరి దశ పనులు పూర్తిచేస్తే వారి జీవితాల్లో వెలుగులు నింపినట్లే. దేశంలో పూర్తయిన రేవులతో పాటు ఇక్కడి రేవును ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. నవంబర్‌లో ప్రపంచ మత్స్య దినోత్సవం నాటికి పనులు పూర్తిచేయాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

ఉపాధి కల్పించాలని..

జిల్లాలోని మత్స్యకారులు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లకుండా ఇక్కడే ఉపాధి కల్పించాలని 2017లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపలరేవుకు శ్రీకారం చుట్టారు. 2018లో భూమి కేటాయించగా... కేంద్రం, రాష్ట్రం చెరో 50శాతం వాటా నిధులు(రూ.288 కోట్లు) కేటాయించాయి. 2021లో శంకుస్థాపన చేసిన అప్పటి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు చేపట్టింది. ఇక 20శాతం పనులే మిగిలి ఉన్నాయి. 116 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన రేవులో 1250 బోట్లు ఆగేలా.. 6250 కుటుంబాలకు ఉపాధి కలగనుంది. ప్రధానంగా మంచినీటి సౌకర్యం కల్పించాలి. నిర్మించిన 32 భవనాలకు విద్యుత్తు, ఇతర సౌకర్యాలు కల్పించి, బకింగ్ హామ్ కెనాల్‌పై వంతెన నిర్మాణం చేపట్టాలి. సోలార్‌ప్లాంట్ కమ్యునికేషన్ భవనంలో పరికరాలు అమర్చడం వంటి కొన్ని చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది.

గ్రూపులుగా ఏర్పాటు చేసి..

చేపల రేవు పూర్తి చేయడంతో పాటు మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి, వలసలు అరికట్టడానికి కసరత్తు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు కుటుంబాలను గ్రూపులుగా ఏర్పాటు చేసి రాయితీపై పెద్ద బోట్లు ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు. కార్యరూపం దాల్చడంలో ఉన్న కొద్దిపాటి జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



నిర్మాణంలో భవనాలు

వడివడిగా అడుగులు

– సుజిత్‌కుమార్, ఫిషింగ్‌హార్బర్ డీఈఈ

వచ్చే నెలలోపు చేపలరేవు సకల సౌకర్యాలతో కళకళలాడబోతోంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బకింగ్‌హామ్ కెనాల్‌పై వంతెన ఏర్పాటుకు రూ.40కోట్లతో ప్రతిపాదనలు పంపాం.

రాయితీపై 40 పెద్ద బోట్లు

– నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ జేడీ

మత్స్యకారుల గ్రూపులకు రూ.48కోట్ల వ్యయంతో 40 పెద్ద బోట్లు ఇవ్వాలనే ప్రయత్నం జరుగుతోంది. త్వరలోనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

విద్యాశాఖలో కదలని దస్త్రం

పైసలిస్తేనే ముందుకు..

జిల్లా విద్యాశాఖ కార్యాలయం పలు ఆరోపణలు ఎదుర్కొంటోంది. పలువురు ఉపాధ్యాయులు, అధికారులపై ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి.ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలు పాటించలేదని ఉపాధ్యాయ సంఘాలే ఆరోపించాయి. జిల్లా సైన్స్ అధికారిగా నియామకంపై విమర్శలు రాగా మరొకరిని నియమించారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 834 ఉన్నాయి. వీటిలో అనేకం నిబంధనలు పాటించడం లేదు. కొన్ని బహుళ అంతస్తులు, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు. అయినా విద్యాశాఖ అధికారులు వాటికి అనుమతులు మంజూరు చేస్తున్నారు. కొత్త పాఠశాలకు అనుమతులు ఇవ్వాలంటే ఎంతో కొంత ఇచ్చుకోవాల్సిందే. ఇటీవల కాలంలో ఈ వ్యవహారం జిల్లా స్థాయి అధికారి ఒకరు చూస్తున్నట్లు విమర్శలొచ్చాయి. విద్యాశాఖలో ఏ దస్త్రం కదలాలన్నా డబ్బులు ముట్టజెప్పాల్సిందే. ఇవ్వక పోతే నెలల తరబడి అది కదలదని విమర్శలొస్తున్నాయి.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

సర్దుబాటు పేరుతో..

జిల్లాలో ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారు. ఇది విద్యాశాఖాధికారులకు కాసుల వర్షం కురిపించింది. విడవలూరు మండలంలో నలుగురు ఉపాధ్యాయుల నుంచి డబ్బులు తీసుకుని.. వారు కోరుకున్న పాఠశాలల్లో సర్దుబాటు చేశారని.. దీన్ని వ్యతిరేకించిన ఓ ఉపాధ్యాయ సంఘం జిల్లా విద్యాశాఖాధికారిని ఆయన ఛాంబర్‌లో గంటల తరబడి కదలకుండా నిరసన తెలిపింది. ఆ తరువాత తప్పు సరిదిద్దినట్లు తెలిసింది. ప్రభుత్వ ఉపాధ్యాయులు కొందరు వ్యక్తిగత సెలవులు తీసుకుని వాటిని మెడికల్ లీవ్‌గా మార్చుకుంటూ జీతం పొందుతున్నారు. ఈ విషయంలో అధికారులు ఒక్కొక్కరి నుంచి కొంత మొత్తం వసూలు చేస్తున్నారు. అల్లూరు మండలంలోని ఓ పాఠశాలలో పేద విద్యార్థినిపై లైంగిక దాడి జరిగితే దాని నివేదిక మార్పు చేసినట్లు విమర్శలున్నాయి. విద్యాశాఖకు సంబంధించి ఫిర్యాదులు వస్తే.. డీఈవో కార్యాలయం పట్టించుకోవడం లేదు. కలెక్టర్ దృష్టికి వెళితేనే చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా సైన్స్ అధికారి నియామకానికి ఓ ఉపాధ్యాయిని వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ జోక్యంతో మరో ఉపాధ్యాయుడిని జిల్లా సైన్స్ అధికారిగా నియమించారు.

అకడమిక్ పరంగా చేసిందేమిలేదు

పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలనే ఉద్దేశంతో జిల్లా విద్యాశాఖాధికారులు పరీక్షలకు ముందే ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వంద రోజులు పాటు అమలు చేస్తుంటారు. ఇప్పటివరకు పలువురు డీఈవోలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం అకడమిక్ పరంగా చేసిందేమి లేదని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఆ ప్రభావం ఫలితాల మీద పడతాయని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

కొన్ని కారణాల వల్ల ఆలస్యం

– పీవీజే రామారావు, డీఈవో

కొన్ని కారణాల వల్ల దస్త్రాలు ఆలస్యం అవుతున్నాయి. వాటిని త్వరగా పరిష్కరిస్తాం. అవినీతికి తావులేకుండా విద్యాశాఖ పనిచేస్తోంది. ఏదైనా సంఘటన జరిగి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

పోలీసు కార్యాలయంలో విజయదశమి వేడుకలు



కుటుంబ సభ్యులతో కలసి పూజలో పాల్గొన్న ఎస్పీ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా పోలీసు శాఖలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆధ్వర్యంలో శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయం, ఎస్పీ, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, డీపీవోలోని ఎంటీవో విభాగంలో వాహన, ఆయుధ పూజలు జరిగాయి. ఎస్పీ తన కుటుంబంతో కలిసి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదివారం తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని.. అర్జీదారులు ఎవరూ రావద్దని సూచించారు.

దళారుల దగా

రైతులకు అందని రూ.4.66 కోట్ల ధాన్యం డబ్బు



న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

ధాన్యాగారంగా పేరుగాంచిన సింహపురిలో రైతులను గత మూడేళ్లుగా దళారులు.. రైస్ మిల్లర్లు దగా చేస్తున్నారు. మోసాలపై ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకున్న వారు లేరు. ఏడు మండలాలకు చెందిన ధాన్యం రైతులను నిలువునా ముంచారు. ధాన్యం కొనుగోలు చేసి అయిదు నెలలు కావస్తున్నా.. కొనుగోలు చేసిన మిల్లర్లు నగదు చెల్లించకపోవడంతో పరారీలో ఉన్నారు. ప్రజా ప్రతినిధులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. మళ్లీ పంటలు సాగుచేసుకోవాలంటే డబ్బులు లేవని వడ్డీలకు తెచ్చుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మోసపోయిన 120 మంది రైతులు

సర్వేపల్లి నియోజకవర్గంలో దళారులు, మిల్లర్లు ధాన్యం రైతులను నగదు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. పోలీసు కేసు పెట్టినా వారిని ఏమీ చేయలేకపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. బహిరంగ మార్కెట్‌లో మంచి ధరలు ఉండటంతో పుట్టి రూ.20వేల చొప్పున తోటపల్లిగూడూరు, మనుబోలు, సర్వేపల్లి తదితర మండలాల రైతులు దళారులకు, మిల్లర్లకు విక్రయించారు. ఒక్కో రైతుకు రూ.7లక్షలు నుంచి రూ.10లక్షలు నెల్లూరు నవాబుపేటలోని రైస్‌మిల్లు యజమాని చెల్లించాల్సి ఉంది. రెండో నగర పోలీసు స్టేషన్‌లోనూ కేసు నమోదు చేశారు. ఆయినా చెల్లింపులు జరగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవూరుపాళెం కేసు రైతుకు రూ.7లక్షలు, పెద్దరెడ్డి కూరు రైతుకు పది ఎకరాలకు చెందిన 30 పుట్ల ధాన్యం నగదు రూ.8లక్షలు రావాల్సి ఉంది. ఇలా చెప్పుకొంటూ పోతే 120 మందికిపైగా రైతులకు 2,200 పుట్ల ధాన్యం తోలారు. ఏడు మండలాలకు చెందిన రైతులకు రైస్‌మిల్లర్లు రూ.4,66,70,000 చెల్లించాల్సి ఉంది. కలెక్టర్ చుట్టూ 20 సార్లు తిరిగినా న్యాయం జరగలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

రూ.7లక్షలకు పైగా రావాలి



పొలం కౌలుకు తీసుకుని వరి పండించి.. నెల్లూరులోని రైస్‌మిల్లుకు ధాన్యం తోలా. రూ.7లక్షలకు పైగా నగదు రావాలి. డబ్బులు ఇస్తారని ఆశతో జనవరి నుంచి తిరుగుతున్నాం. జూన్ నెల నుంచి కనిపించడం లేదు. రెండో నగర పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాం. ప్రతి అధికారికి అయిదు నెలలుగా ఫిర్యాదు చేస్తున్నాం. వరినాట్లు వేసుకునేందుకు డబ్బులు లేక పొలం బీడు పెట్టుకున్నాం.

– వెంకటేష్‌కుమార్, తోటపల్లిగూడూరు

30 పుట్ల ధాన్యానికి ఒక్కరూపాయి రాలేదు



పది ఎకరాల్లో ధాన్యం పండించా. 30 పుట్ల ధాన్యం దళారికి విక్రయించా. ఆయన మిల్లుకు తోలాడు. ఒక్కరూపాయి కూడా డబ్బు రాలేదు. అయిదు నెలలుగా తిరుగుతున్నాం. ప్రస్తుతం పంట సాగు చేసుకునేందుకు డబ్బులు లేవు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– జానకిరామిరెడ్డి, పెద్దచెరుకూరు

రెవెన్యూ సహాయకుల సంఘం కమిటీ ఎన్నిక

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమ్‌దాస్, జి.నరసింహమూర్తి ఎన్నికయ్యారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సంఘం కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రామిశెట్టి మురళీకృష్ణ, కోశాధికారిగా ఆనంద సుదర్శన్, సహాయ కార్యదర్శులుగా ఏలూరు బుజ్జయ్య, సభ్యులుగా నాగార్జున, శ్రీనివాసులు, సుమలత, ప్రవీణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

దేవాదాయశాఖకు ఇల్లు విరాళం

సంగం, న్యూస్‌టుడే: 'సంగం గాంధీ'గా పేరుపొందిన స్వాతంత్య్ర సమరయోధుడు అక్కరాజు వెంకట్రామయ్యకు చెందిన సంగంలోని నివాసగృహాన్ని ఆయన మనవడు పద్మనాభరావు శనివారం దేవాదాయశాఖకు అప్పగించారు. రూ. పదిలక్షల విలువ కలిగిన ఇంటికి సంబంధించిన పత్రాలను దేవాదాయ సిబ్బందికి అందజేశారు.



దేవాదాయ సిబ్బందికి ఇంటి పత్రాలు అందజేస్తున్న పద్మనాభరావు దంపతులు



ఈవో రామారావుకు బంగారు హారాన్ని అందజేస్తున్న వెంకటరెడ్డి కుటుంబం

జగన్నాథ దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రి : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు రూ.10లక్షల విలువైన బంగారు హారాన్ని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వ్యాపారవేత్త పంకజ్ రెడ్డి బహూకరించారు. దాత కుటుంబానికి సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారిదర్శనం చేయించారు. ఆలయ ఈవో రామారావు వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో మద్యం దుకాణాలను సోమవారం లాటరీ విధానంలో కేటాయించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు పూర్తి చేశారు. మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం అర్ధరాత్రి ముగిసింది. 182 మద్యం దుకాణాలకు 3,890 దరఖాస్తులు వచ్చాయి. శని, ఆదివారాల్లో వీటిని పరిశీలించి దరఖాస్తుదారులకు ఎంట్రీ పాస్‌లు అందజేశారు. ఆదివారం కలెక్టర్ ఆనంద్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటుచేయాలన్నారు. దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం ఎనిమిది గంటల్లోపు కళాక్షేత్రానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీ దయాసాగర్, డీసీతో శ్రీనివాసనాయుడు, ఏఈఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు

యువకుడి బలవన్మరణం

కావలి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాకుండా పుట్టింటిలోనే ఉంటున్నారని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం కావలి గ్రామీణ పోలీసుస్టేషన్ ఎస్సై రాజేశ్వరరావు కేసు నమోదు చేశారు. చౌదరిపాలెనికి చెందిన కోడెల సాయి కార్తీక్(26)కు భార్యతో వివాదాలున్నాయి. ఈ క్రమంలో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయారు. పలుమార్లు కాపురానికి రావాలంటూ ఆమెను కోరినా.. నిరాకరిస్తుండటంతో ఆయన పురుగుమందు తాగారు. ఇది గమనించిన స్థానికులు తొలుత కావలిలో, అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లి చికిత్స చేయించినా.. ఫలితం దక్కలేదు. ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించారు.

అక్రమమని తేల్చినా..

ఆక్రమిత భూములకు రిజిస్ట్రేషన్లు

కావలి, న్యూస్‌టుడే

శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో నిషేధించిన భూములకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కేవలం ప్రకటన జారీ చేసి చేతులు దులుపుకోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆక్రమార్కులు లబ్ధి పొందుతున్నారు.

పట్టణంలో వేసిన లేఅవుట్లలో ప్రభుత్వ భూములున్నా యని అధికారులు గుర్తించారు. ఈమేరకు గత ఆగస్టు 21న కావలి పురపాలక సంఘం పబ్లిక్ నోటీసు ప్రకటన జారీ చేసింది. అయినా నిషేధిత సర్వే నంబర్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కొద్దిరోజులుగా

వద్దన్న వివరాలివే

సర్వే నంబరు 1155, 1207లో 4.46, 1874,1876లో 6.52, 656, 702లో 30, 210, 211లో 9.92, 1336 నుంచి 1364 వరకు కొన్ని భాగాల్లో 11.38, 441నుంచి 445 వరకు కొన్ని భాగాల్లో 12.3, 1360 నుంచి 1370వరకు కొన్ని భాగాల్లో 4.88, 131, 132తోపాటు 224, 225లో కొన్ని భాగాల్లో 10.19, 343, 344, 345లో 2.52, 888, 889 భాగాల్లో 3.12, 484, 496ల్లో రెండు, 885, 886లో 4.33, 883, 884, భాగాలు, 885, 886లో 10.94, 5,11లో 3.24, 7లో 5.2, 832, 835, 836లో 7.86, 1226-2లో 3.62, 331, 332, 334లో 17 ఎకరాల చొప్పున ప్రభుత్వ భూములున్నట్లు గుర్తించి హెచ్చరిక నోటీసు ఇచ్చారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం

వీటి లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. ఇలా మద్దూరుపాడులో ఓ స్థిరాస్తి క్షేత్రం, గాయత్రీనగర్‌లో భూములకు వారం రోజుల వ్యవధిలో రిజిస్ట్రేషన్లు జరిగిన తీరుపై దుమారం రేగుతోంది.

➡ పట్టణంలోని పాపిరెడ్డి చెరువు శిఖం, ముసునూరు వద్ద ప్రభుత్వ పోరంబోకు భూముల్లో సర్వే నంబర్లను మార్చి గతంలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రభుత్వ భూములను కలిపేసుకొని లేఅవుట్లు వేశారు. వైకాపా హయాంలో జరిగిన వీటిపై విమర్శలు వెల్లువెత్తాయి. పట్టణ పరిధిలోని కుంటలు, చెరువులు, ఇతర పోరంబోకు భూములన్నీ కబ్జా చేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో వీటిపై విచారణ చేశారు. 130 ఎకరాలకు పైగా సర్కారు భూములు స్థిరాస్తి వ్యాపార క్షేత్రాల ముసుగులో అన్యాక్రాంతమైనట్లు తేల్చారు. ఈమేరకు ఎక్కడెక్కడ ఏమేరకు ఉన్నాయో గుర్తించి హెచ్చరిక నోటీసు ప్రకటించారు. వీటిలో రిజిస్ట్రేషన్లు చేయరాదని స్పష్టంచేశారు.

వీటిలో కట్టవద్దని: శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి

ఏదైనా కొన్ని చెల్లిస్తున్న భూములకే రిజిస్ట్రేషన్లు చేయాలి. లేఅవుట్ల వద్ద ల్యాండ్ బ్యాంక్స్ వివరాలు ప్రదర్శించాం. అనధికార లేఅవుట్లను విభజించాం.

పరిశీలించి ఆమోదించాలి

తప్పకుండా పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయాలి. సర్వే నివేదికలు కూడా తీసుకోవాలని చెబుతున్నాం. రిజిస్ట్రేషన్ చేయడంతో అక్రమాలు జరగకుండా చూస్తాం. – హరివర్మ, జిల్లా రిజిస్ట్రార్

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి



షేక్ ఖాజారంతుల్లా(పాత చిత్రం)

ఉదయగిరి, వింజమూరు, న్యూస్‌టుడే: వింజమూరు మండలం చాకలకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయగిరి పట్టణం బీసీ కాలనీకి చెందిన షేక్ ఖాజారంతుల్లా (56) ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చాకలకొండ ఏపీజీబీలో డిప్యుటేషన్‌పై ఒక్కరోజు విధులు నిర్వహించేందుకు శుక్రవారం వెళ్లారు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఉదయగిరికి బయలుదేరారు. చాకలకొండ సమీపంలో మేకల మంద అడ్డంగా రావడంతో వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. తలకు తీవ్రగాయమైంది. ఆ మార్గంలో వెళుతున్న వారు గమనించి బ్యాంకు సిబ్బందికి సమాచారమందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వింజమూరులో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు.

డ్రైవర్ దుర్మరణం..

ఉలవపాడు : ఉలవపాడులోని బైపాస్‌లో ఫైవంతెనపై ఆపి లారీ మోకులు సరిచేసుకుంటుండగా మరో వాహనం ఢీకొని డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ నుంచి మిరపకాయల లోడుతో లారీ తమిళనాడు వెళ్తోంది. ఉలవపాడులోని బైపాస్‌లో ఆపి మోకు సరిచేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని.. తమిళనాడుకు చెందిన డ్రైవర్ మురుగన్ గుణాలన్(30) ప్రాణాలొదిలాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త కిడ్నాప్... భార్య ఆత్మహత్య



చెంచులక్ష్మి (పాతచిత్రం)

న్యూస్‌టుడే, రాపూరు

భర్తను వ్యాపారి కిడ్నాప్ చేయడం.. ఎంత వేడుకున్నా వదిలి పెట్టకపోవడంతో భార్య చెంచులక్ష్మి(30) శనివారం రాపూరు మండలం గిలకపాడు రోడ్డు వద్ద గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త రవి(ఉరఫ్ దావీద్) రాపూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సిమెంట్ రాళ్ల వ్యాపారి వెంకటసుబ్బారెడ్డి భర్త రవిని బలవంతంగా కిడ్నాప్ చేసి తీసుకెళుతుండగా.. ఎంత వేడుకున్నా వదిలిపెట్టలేదు. జీవితంపై విరక్తి చెంది గుళికలు తీసుకుంది. చికిత్స నిమిత్తం రాపూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గూడూరు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందారు.

పోలీసుల వివరాల మేరకు..

దీనిపై ఎస్ఐ రాజేశ్ మాట్లాడుతూ... తిరుపతి జిల్లా డక్కిలి మండలం దందోలుకు చెందిన చెంచులక్ష్మికి ఆమె భర్త రవి మధ్య తలెత్తిన వివాదమే ఆత్మహత్యకు కారణమన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సుబ్బారెడ్డి సిమెంట్ రాళ్ల తయారీ పని కోసమని దంపతులను ఇరవై రోజుల క్రితం తీసుకెళ్లారు. రవి యజమాని వద్ద రూ.76 వేలు తీసుకొని రూ.20 వేలు చెల్లించారు. సెప్టెంబరులో అక్కడి నుంచి వారిద్దరు గిలకపాడుకు చేరుకున్నారు. వెంటనే యజమాని వచ్చి భర్తను మాత్రమే బలవంతంగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో రవి తన భార్యకు ఫోన్ చేసి దసరాకు పండగకు రమ్మని పిలిచారు. పండగ నాడు భార్య వెళ్లేందుకు సిద్ధమవగా భర్త ఫోన్ చేసి ఇప్పుడు వద్దని చెప్పడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్ఐ పేర్కొన్నారు.

వర్షమొస్తే వణుకే..!

న్యూస్‌టుడే, వెంకటాచలం

విపత్తుల సమయంలో ప్రజలకు పునరావాసం కల్పించేందుకు తీర ప్రాంత గ్రామాల్లో ఏర్పాటు చేసిన తుపాను రక్షిత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా చోట్ల దశాబ్దాలుగా భవనాల నిర్వహణ పట్టించుకునే వారే లేరు. కనీసం మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు.. వాతావరణ పరిస్థితుల్లో మార్పులుంటే హడావుడి చేస్తున్న అధికార యంత్రాంగం శాశ్వత ప్రాతిపదికన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తీర ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. వైకాపా అయిదేళ్ల పాలనలో పాలకులకు విన్నవించినా కనీసం పరిశీలించలేదని వాపోతున్నారు.. జిల్లాలో తీరంలో ఉన్న భవనాల్లో స్లాబ్‌లు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. వర్షమొస్తుందంటే ఎలాంటి విపత్తు వస్తుందోనని స్థానికుల్లో భయాందోళన నెలకొంది.

దశాబ్దాల క్రితం నిర్మించడంతో...

జిల్లాలో వెంకటాచలం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, విడవలూరు, అల్లూరు తదితర మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో తుపాను షెల్టర్లు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు, విపత్తుల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలను రక్షిత భవనాల్లో వారికి పునరావాసం కల్పిస్తారు. వరదలు తగ్గిన తరువాత వారిని తిరిగి ఇళ్లకు పంపుతారు. ప్రస్తుతం అవన్నీ దశాబ్దాల క్రితం నిర్మించడంతో కొన్ని చోట్ల పెచ్చులూడుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న కేంద్రాల్లోకి వెళ్లేందుకు తీర ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

మనుగడ ప్రశ్నార్థకం..

➡ వెంకటాచలం మండలంలోని తిరుమలమ్మపాళెం షెల్టరు శిథిలావస్థకు చేరింది. పునాదులకు ఏర్పాటు చేసిన పిల్లర్ల కమ్మీలు కూడా బయట పడటంతో భవన మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.



తిరుమలమ్మపాళెం వద్ద శిథిలావస్థలో తుపాను రక్షిత భవనం

➡ తోటపల్లిగూడూరు మండలంలోని ముత్యాలతోపు, కొత్త పట్టపుపాళెం, నడింపాళెం, నెల్లిమిట్ట, పాతపాళెం, మల్లికార్జునపురం, కాటేపల్లి గ్రామాల్లో ఉన్నవి శిథిలావస్థకు చేరుకోగా వసతులు లేవు.

➡ ముత్తుకూరు మండలంలోని ఈపూరు పట్టపుపాళెం, పైనాపురం, నేలటూరు పట్టపుపాళెంలో ఉన్నవి శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేయించాలని తీర ప్రాంత వాసులు కోరుతున్నారు.

➡ వెంకటాచలం ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ... తిరుమలమ్మపాళెం తుపాను రక్షిత భవనం పరిశీలిస్తామని, శిథిలావస్థలో ఉంటే మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,303
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,424
వెండి గ్రాము :	రూ. 95.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	133
రిటైల్	155
లేయర్	120
బ్రాయిలర్స్	225
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	256
లేయర్ మాంసం	204
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	143
లేయర్	120
బ్రాయిలర్స్	254
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	280
లేయర్ మాంసం	204

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు



ఎమ్మెల్యేకు విరాళాలు అందజేస్తున్న దాతలు

వరద బాధితులకు ఆర్థిక సాయం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు పలువురు దాతలు ఆదివారం తమ విరాళాలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. తంబపనేని నరసింగరావు రూ.10 వేలు, తోకల రవికుమార్, మన్నం రమణయ్య చెరో రూ.10వేలు అందజేశారు. ● అంకమ్మ ఆలయ అభివృద్ధికి కృష్ణమనేని అనిల్‌కుమార్, మయూర రూ.25,116, అద్దంకి మాలకొండయ్య రూ.5,116 విరాళాలను ఆలయ కమిటీ సభ్యుడు వై.వెంకటరెడ్డి అందజేశారు.

ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి విరాళం

కందుకూరు, గుడ్లూరు, న్యూస్‌టుడే: ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి రూ.2,50,000 విరాళాన్ని మునుసూరుకు చెందిన జక్కంపూడి హనుమంతరావు, పద్మ, అనిల్, శ్రీవల్లి దంపతులు ఆదివారం అందజేశారు. వెమిడిచిపాడు బస్టాండు వద్ద పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : గ్రామంలోని ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - **రామయ్య, దగదర్తి**

సమాధానం: వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్వర్లు, ఎంపీడీవో**

? వలేటివారిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలో అంకభూపాలపురం తారురోడ్డు అధ్వానంగా మారడంతో వర్షపునీరు నిలుస్తోంది. - **వెంకటేశ్వర్లు, స్థానికుడు**

✓ పంచాయతీ కార్యదర్శి బదిలీ అయ్యారు. పరిశీలించి రెండు రోజుల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. - **రమేష్ బాబు, ఈవోపీఆర్డీ**

? కావలిలోని రామ్మూర్తిపేట, పుల్లారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో కొన్నాళ్లుగా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. పలు చోట్ల కుళాయి లీకవుతుంది. - **జి.బాలకృష్ణ, పుల్లారెడ్డినగర్**

✓ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరా చేస్తాం. - **మెంతం శ్రీనివాసులురెడ్డి, ఏఈ, కావలి**

? దుత్తలూరు పంచాయతీపరిధిలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయంగా ఉంది. - **శ్రీనివాసులు, దుత్తలూరు**

✓ వీధిదీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం - **నజీముల్లా, పంచాయతీ కార్యదర్శి**

? ఉలవపాడులోని పాత హైవేరోడ్డులోని వీధుల్లో ఆదివారం కొన్ని వీధిదీపాలు వెలగడం లేదు. - **సుబ్బారావు, ఉలవపాడు**

✓ పరిశీలించి రెండు రోజుల్లో వీధిదీపాలు వెలగించే ప్రయత్నం చేస్తాం. - **వీరయ్య, పంచాయతీ కార్యదర్శి**

బీసీలంతా ఏకమవ్వాలి

మాజీ ఎమ్మెల్సీ భూధాటి రాధయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూధాటి

కావలి, న్యూస్‌టుడే: బీసీలు ఐకమత్యంతో అడుగులు వేస్తే అన్ని రంగాల్లోనూ అవకాశం పొందగలరని మాజీ ఎమ్మెల్సీ భూధాటి రాధయ్య అన్నారు. కావలి పట్టణంలో బీసీ ఐక్యవేదిక కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం కొన్ని ఆధిపత్యవర్గాలకే పరిమితమవుతుందన్నారు. తొలుత కావలిలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలేసి.. అనంతరం పట్టణంలో ర్యాలీగా కోఆపరేటివ్‌కాలనీలోని కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు, తెదేపా లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, భాజపా పట్టణాధ్యక్షులు బ్రహ్మానందం, నాయకులు ఉరిటి గోవింద్, చిన్ని వరప్రసాద్ పాల్గొన్నారు.

అందని ఎరువులు.. అన్నదాతకు తిప్పలు

అన్నదాతకు చేయూత ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పంట సాగు సమయానికి ఎరువులందకపోవడంతో సాగు భారంగా మారుతోంది. దీంతో పంటలను కాపాడుకునేందుకు ప్రైవేటు దుకాణాల్లో ఎరువులను కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతన్నలు చెబుతున్నారు.

న్యూస్‌టుడే, వలేటివారిపాలెం, ఉలవపాడు

రైతులకు ఎరువులు, పంట బీమా, తదితర సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. ఎరువుల విక్రయాల బాధ్యతను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు అప్పగించింది. నియోజకవర్గంలో 15 పీఏసీఎస్‌లు ఉండగా బడేవారిపాలెం సొసైటీలో మాత్రమే ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. మిగతా ప్రాంతాల రైతులకు దూరాభారం కావడంతో ఎరువులందని పరిస్థితి నెలకొంది.

సాగుకు ఇబ్బంది

నియోజకవర్గంలో ప్రస్తుతం మిర్చి, పొగాకు, మినుము, వరి సాగు అవుతోంది. కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నా.. రైతులకు అందకపోవడంతో సాగుకు ఇబ్బంది నెలకొంది. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఎరువుల విక్రయాల బాధ్యత పీఏసీఎస్‌లకు అప్పగించడంతో ఇబ్బంది నెలకొంది. విక్రయాలను చాల చోట్ల నిలిపి వేశారని రైతులు చెబుతున్నారు. దీంతో ప్రైవేటు దుకాణదారులు ఆక్రమించుకొని డీఏపీ బస్తా ధర రూ.30 నుంచి రూ.100ల వరకు అధిక ధరలకు అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైతు సేవా కేంద్రం

రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 8 నాటికి ఎరువుల నిల్వలు (టన్నుల్లో)..

మండలం	డీఏపీ	ఎన్‌పీకే	యూరియా	ఎస్ఎస్‌పీ
కందుకూరు	0.15	2.85	–	–
వలేటివారిపాలెం	1.15	–	61.515	–
లింగసముద్రం	8.1	7.15	2.54	1.4
ఉలవపాడు	0.5	10.5	–	–
గుడ్లూరు	10.9	0.95	0.135	3.0

అధిక ధరలకు కొనుగోలు చేశా

రైతు మోహనరావు, ఆత్మకూరు



ప్రస్తుతం వరి సాగుకు సన్నద్ధం అవుతుండటంతో ఎరువులను కొనుగోలు చేస్తున్నాను. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువుల విక్రయాలు లేకపోవడంతో ప్రైవేటు దుకాణ నిర్వహకులు చెప్పిన ధరకు కొనుగోలు చేయక తప్పడం లేదు. పెట్టుబడులు పెరుగుతున్నాయి.

త్వరగా విక్రయాలు జరిగేలా చర్యలు : అనసూయ, ఏడీఏ, ఉలవపాడు

నియోజకవర్గంలో 15 పీఏసీఎస్‌ల్లో బడేవారిపాలెం సొసైటీలో విక్రయాలు జరుగుతున్నాయి. 13 పీఏసీఎస్‌లకు ఎరువుల విక్రయ ధ్రువీకరణ పత్రాలు గత నెలలో వచ్చాయి. జీఎస్టీ నంబరు వచ్చిన వెంటనే విక్రయాలు చేపడతాం. ఓగూరు పీఏసీఎస్‌లో సాంకేతిక సమస్యతో ధ్రువీకరణ పత్రం మంజూరు కాలేదు. మార్క్‌ఫెడ్ అధికారుల సూచనల మేరకు రైతు సేవా కేంద్రాల్లోని ఎరువులను విక్రయిస్తాం. ప్రైవేటు దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అదనంగా అమ్మకాలు జరుగుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం.

తుపాన్‌పై అప్రమత్తం

కావలి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయిగుండంతో తుపాన్ రావచ్చనే హెచ్చరికలతో కావలికి చెందిన వివిధ శాఖల యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఆదివారం డివిజన్ పరిధిలోని అన్ని శాఖల సిబ్బందితో ఆర్డీవో ఎం.వంశీ కృష్ణ సమావేశమయ్యారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు కురవనున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన స్థానికంగా, బోగోలు మండలంలో పర్యటించి తుపాన్ అప్రమత్తతపై సూచనలు చేశారు. ఏపీఎస్పీడీసీఎల్ కావలి పట్టణ, గ్రామీణ ఏఈలు వై.వసంతరావు, సీహెచ్.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తుపాన్ ఛాయలు రాగానే విద్యుత్తు సరఫరా నిలిపేస్తామన్నారు. **ఉదయగిరి :** తుపాను హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కంట్రోల్‌రూంలో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు వర్షాల కారణంగా ఇబ్బందులు తలెత్తితే 99895 02077 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. **బిట్రగుంట :** బోగోలు మండల వ్యాప్తంగా ఆదివారం తుపాను హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సురేష్‌బాబు పేర్కొన్నారు. ప్రధానంగా మత్స్యకారులు వేటకు వెళ్లొద్దన్నారు. **అల్లూరు :** అధిక వర్షాల కారణంగా ముంపు ప్రాంతవాసులను తరలించేందుకు సురక్షిత కేంద్రాలను కావలి ఆర్డీవో వంశీ కృష్ణ ఆదివారం అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాల, ఇస్కపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో వసతులను పరిశీలించారు. కావలి డీఎస్పీ శ్రీధర్ అల్లూరు పోలీస్‌స్టేషన్‌లో వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రభుదీప్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవస్థల ప్రయాణం



పూరేటపల్లిలో సిమెంటు రహదారులపై మురుగు నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి పైపులకు మరమ్మతులు చేయించకపోవడంతో నీరు వృథాగా పోతోందని మురుగునీటితో కలిసి రోడ్డుపై నిలుస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ రోడ్లన్నీ బురదతో నిండిపోవడంతో మట్టి దారులను తలపిస్తున్నాయని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, గుడ్లూరు**

పొంచి ఉన్న ప్రమాదం



బోగోలు కుమ్మరగేటు(రైల్వే 143గేటు) తూర్పున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఒకవైపు దెబ్బతింది. అటువైపే దిమ్మె కింద భాగం మురుగు కాలువల్లో ఉంది. వర్షాలు కురిస్తే ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయే అవకాశం ఉంది. ఈ విషయమై స్థానిక ట్రాన్స్‌కో ఏఈ జడరాయ స్పందిస్తూ పరిశీలించి తక్షణ చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, బిట్రగుంట**

సింగమనేనిపల్లి దారిది..!



వలేటివారిపాలెం మండలం సింగమనేనిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. కందుకూరు నుంచి మోపాడు మీదుగా సింగమనేనిపల్లికి నిత్యం వందలాది మంది రాకపోకలు చేస్తుంటారు. కొద్దిపాటి వర్షం పడినా గుంతల్లో నీళ్లు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణం చేయాలంటే.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

ఏళ్లుగా నీటి సమస్య.. ప్రజల అవస్థ



షెడ్డుకే పరిమితమైన మినరల్ వాటర్ ప్లాంటు

న్యూస్‌టుడే, ఉదయగిరి

పట్టణంలో అంతర్భాగమైన బీసీ కాలనీలో ఏళ్ల తరబడి ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం 200 కుటుంబాల వరకు ఉన్నాయి. వాడుక అవసరాలకు బోర్ల ద్వారా రోజుమార్చి రోజు ఇస్తున్నారు. తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేదు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో ఆయన నిధులతో కాలనీలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుకు శ్రీకారం చుట్టి షెడ్డు ఏర్పాటు చేశారు. అంతటితోనే ఆగిపోయింది. ఆతరువాత ఎన్టీఆర్ సుజల పథకానికి స్టీల్ ట్యాంకు తెచ్చారు. కొన్నేళ్లుగా పాఠశాల వద్ద ఎండకు ఎండుతూ, వానకు తడుస్తోంది. గత్యంతరం లేక క్యాన్ నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

ట్యాంకు లేక..

కాలనీలో నీటి అవసరాలు తీర్చేందుకు ఓవర్ హెడ్ ట్యాంకు అందుబాటులో లేదు. పాఠశాల వద్ద సింథటిక్ ట్యాంకు ఉన్నా అందులో నీరు నింపక నిరుపయోగంగా దర్శనమిస్తోంది. కుళాయిలకు రోజుమార్చి రోజు నీరు విడుదల చేస్తుండడంతో డ్రమ్ముల్లో నిల్వ చేసుకొని వినియోగించుకుంటున్నారు. అయిపోతే అవస్థలు పడాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు.



నిరుపయోగంగా దర్శనమిస్తున్న ట్యాంకు

చర్యలు తీసుకుంటాం

జగన్నాథం, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

నా దృష్టికి రాలేదు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. నిరుపయోగంగా ఉండే ట్యాంకుల వివరాలను తెలుసుకొని వాటిని వినియోగంలోకి తెస్తాం.

అంబరాన్నంటిన దసరా సంబరం



గుడ్లూరు : గ్రామోత్సవంలో కళాకారుల ప్రదర్శన



దుత్తలూరు : వెంగమాంబ దంపతులకు పల్లకిసేవ



దగదర్తి : అగ్నిగుండం కార్యక్రమానికి హాజరైన భక్తులు



కావలి బృందావనకాలనీలో శ్రీవెంకటేశ్వరస్వామివారికి పుష్పయాగం



ఉదయగిరి: కూరగాయలతో రాజరాజేశ్వరి అలంకారం



సీతారామపురం : ఊరేగింపులో ఆకట్టుకున్న నృత్యాలు

ఆత్మహత్యాయత్నానికి దారితీసిన సరదా

కావలి, న్యూస్‌టుడే: కావలి మండలం రుద్రకోటలో దసరా పండగకు అత్తింటికి వచ్చిన అల్లుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉలవపాడు మండలం భీమవరానికి చెందిన తమ్మిశెట్టి ఉదయకుమార్ భార్య యమునతో పాటు అత్తింటివారు సరదా పట్టించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం అతను పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆశ్చర్యానికి గురైన వారు వెంటనే కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

అత్త, తోడికోడలు కొట్టారని..

కావలి, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని బుడంగుంటకాలనీలో అత్త, తోడికోడలు కొట్టారంటూ పర్రి గీత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నిత్యం తాను మేపే మేకల్లో ఒకదాన్ని అత్త, తోడికోడలు అమ్మేయడంపై ఆదివారం గీత వారిని నిలదీశారు. ఈ క్రమంలో మాటా మాటా పెరిగి వారు చేయిచేసుకున్నారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె పురుగుమందు తాగారు. ఆమెను కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

కారు, ఆటో ఢీ ముగ్గురికి తీవ్ర గాయాలు

కావలి, న్యూస్‌టుడే: కావలి మండలం గౌరవరం సమీపంలో టోల్‌ప్లాజా వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటో, కారు ఢీకొన్నాయి. ఆదివారం ఉదయం కావలి వైపునకు వస్తున్న కారును ఎదురుగా రాంగ్‌రూట్‌లో వెళ్లిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నెల్లూరుకు తీసుకెళ్లి చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ ప్రమాద ఉదంతంపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు చెబుతున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి



ఖాళీ పాత్రలతో ఆందోళన చేస్తున్న ప్రజలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేస్తూ బిజ్జంపల్లిలో గ్రామస్థులు ఆదివారం ఖాళీ వంట పాత్రలను పట్టుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టకపోవడంతో నిత్యావసరాల ధరలు ఆకాశనంటుతున్నాయన్నారు. ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఎన్నడూలేని విధంగా బియ్యం ధరలు ఉన్నాయన్నారు. వెంటనే ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు.

వెండి కిరీటం బహూకరణ



పూజలు చేస్తున్న భక్తులు

లింగసముద్రం, న్యూస్‌టుడే: లింగసముద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామికి స్థానిక భక్తుడు రాయళ్ల ప్రసాద్ దంపతులు రూ.1.30 లక్షల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. శనివారం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారికి కిరీటాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అడపా రంగయ్య, అర్థకుల చిన్నసత్యం పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న పరిమి ట్రస్టు వ్యవస్థాపకుడు సీతారామయ్య

బిట్రగుంట, న్యూస్‌టుడే: మొక్కల పెంపకతో పర్యావరణాన్ని కాపాడుకోవడంతోపాటు మంచి ఫలాలు అందుకుందామని పరిమి వీరభద్రరావు ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు సీతారామయ్య పిలుపునిచ్చారు. బోగోలులో ఆదివారం వివిధ రకాల మామిడి మొక్కలు పంపిణీ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కందుకూరు, గుడ్లూరు : మండలంలోని నరసాపురం వద్ద అక్రమంగా కావలికి తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పెదపవని నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామన్నారు. యజమానులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై వెంకటరావు తెలిపారు. ఈ నెల 14 నుంచి భారీ వర్ష సూచన, తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

ఒకరికి గాయాలు

ఉలవపాడు, న్యూస్‌టుడే : ఉలవపాడులోని బైపాస్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు ద్విచక్రవాహనం పైనుంచి పడి గాయపడ్డాడు. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు కావలి నుంచి సింగరాయకొండ వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న ఒక వ్యక్తి బైపాస్‌లో అదుపుతప్పి పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో గాయపడిన వ్యక్తిని మొదట ఉలవపాడు ఆసుపత్రికి అక్కడ నుంచి కావలి ఆసుపత్రికి తరలించారు. కావలి ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

జూద స్థావరాలపై దాడులు

జలదంకి, న్యూస్‌టుడే: వేములపాడులో కొంత కాలంగా రహస్యంగా నిర్వహిస్తున్న జూద స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. అయిదుగురిని అదుపులోకి తీసుకుని, వీరి నుంచి రూ 6300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు.

పెద్ద పంచాయతీలు

నరకానికి ఆనవాళ్లు

న్యూస్‌టుడే, బిట్రగుంట

కుగ్రామాలు కూడా అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. కానీ మండల కేంద్రంతో పాటు పెద్ద పంచాయతీల్లోనూ అభివృద్ధి కరవైంది. దశాబ్దాల తరబడి హామీలతో పాలకులు కాలం వెళ్లబుచ్చుతున్నారు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇదీ బోగోలు, విశ్వనాథరావుపేటలో పరిస్థితి.



బోగోలు : నీరు తెచ్చుకుంటున్న గ్రామస్థులు

బోగోలులో 15 వేలు, విశ్వనాథరావుపేటలో 10 వేల మంది చొప్పున ప్రజలు ఉన్నారు. ఈ రెండు పంచాయతీల హద్దులు వేరైనా కలిసే ఉంటాయి. ప్రధానంగా తాగునీరు, మురుగునీటి వ్యవస్థ సరిగా లేవు. అంతర్గత రోడ్లు 40 ఏళ్ల కిందట వేసినవే. ఈ జంట పంచాయతీలపై పాలకులు ఉదాసీనంగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

పరిశుభ్రతపై ఏదీ దృష్టి

బోగోలు, విశ్వనాథరావుపేట జంట పంచాయతీల్లో పరిశుభ్రత పెంచేందుకు చెత్తతో సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు రోగాన బారిన పడుతున్నారు.



విశ్వనాథరావుపేట: మురుగుకాలువ ఇలా..

మాస్టర్ ప్లాన్ అవసరం

అందమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలంటే అవసరమైన సౌకర్యాలను గుర్తించి.. అమలు చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అంతర్గత రోడ్లలో ఆక్రమణలు తొలగించాలి. రెండు పెద్ద పంచాయతీల్లో ఇరుకు రోడ్లైనందున అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి. రోడ్ల సౌకర్యం మెరుగుపరచాలి. దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలు, తీగలు మార్చాలి. 40 ఏళ్ల కిందట వేసిన మంచినీటి సరఫరా పైప్‌లైన్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలి. పైప్‌లైన్ల విస్తరణ ప్రక్రియ కూడా చేపట్టాలి. అవసరమైన చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు నిర్మించి సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి శుద్ధి నీరు అందేలా చూడాలి.

అందమైన రూపం తెస్తాం

డీవీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే

పెద్ద పంచాయతీలు అభివృద్ధిలో వెనుకపడిన మాట వాస్తవమే. ప్రణాళికలు సిద్ధం చేసి దశలవారీగా అభివృద్ధి చేసి అందమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం.

యువకుడి ఆత్మహత్య

అల్లూరు : ఇందుపూరుకు చెందిన పులి మనీష్(23) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిశోర్‌బాబు తెలిపారు. గ్రామ సమీపంలోని పొలాలకు వెళ్లే దారిలో చెట్టుకు ఉరి వేసుకోవడం గమనించిన రైతులు..పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పోరాట యోధుడు సాయిబాబా

కావలి : మానవ హక్కుల కోసం పోరాడిన ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రభుత్వ హత్యేనని సీపీఎం నాయకులు తాళ్లూరి మాల్యాద్రి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

గుండెపోటుతో ఎస్‌ఎంసీ ఛైర్మన్ మృతి

కందుకూరు, గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని మోచర్ల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ వడగా భాస్కర్‌రావు(35) ఆదివారం మృతి చెందారు. ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి పోయి.. ప్రాణాలొదిలాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

గిరిజన మహిళపై అత్యాచారయత్నం

మనుబోలు, న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తున్న గిరిజన మహిళపై కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మందా పోలయ్య అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గిరిజన మహిళ ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తోంది. పోలయ్య మద్యం తాగి బాధితురాలి ఇంట్లోకి వెళ్లి అత్యాచారానికి యత్నించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో నోరుమూసే ప్రయత్నించాడు. అతని బారి నుంచి విడిపించుకొని బిగ్గరగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవన్ బాబు మాట్లాడుతూ పోలయ్య ప్రవర్తన సరిగా లేకపోవడంతో అధ్యక్ష పదవితో పాటు, పార్టీ సభ్యత్వం నుంచి బహిష్కరించామని, అతనికి మా పార్టీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. బాధితురాలి అండగా నిలుస్తామని ఆయన పేర్కొన్నారు.

ధ్రువపత్రాలతో హాజరు కావాలి

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో నేటి నుంచి స్పాట్, మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్లు హనుమారెడ్డి, సాయినాథ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ అర్హత సాధించిన వారితో పాటు, రాయని అభ్యర్థులు కూడా సంప్రదించవచ్చన్నారు. వీటితో పాటు పీహెచ్‌డీ సీటు పొందిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో 19లోగా వీఎస్‌యూలో రిపోర్టు చేయాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : కోవూరు పట్టణంలోని ఎన్ఎస్సార్ కాలనీలో రమేశ్ అంగడి సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
– రమణమ్మ, ఎన్ఎస్సార్ కాలనీ, కోవూరు.

సమాధానం: సిబ్బందిని పంపించి వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాను.
– శివకుమార్, ఈవో, కోవూరు.

? కోవూరు గుమ్మళ్లదిబ్బలోని సచివాలయ వీధిలో చెత్తను తరలించడం లేదు. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
– కృష్ణ, గుమ్మళ్లదిబ్బ, కోవూరు.

✓ సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం.
– శివకుమార్, ఈవో, కోవూరు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం వద్ద మైపాడు మార్గం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం తెదేపా నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ మైపాడు రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా కేంద్రం నుంచి నిధులు సాధించడంలో కల్యాణ్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. రోడ్డు పూర్తయితే రైతులు, భక్తులు, పర్యాటకులు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.64 కోట్లతో అంచనాలు రూపొందించామని త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 'పల్లె పండగ' కార్యక్రమం ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో సమస్యలను గుర్తించి అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. కార్యక్రమంలో వీరేంద్ర నాయుడు, సురేష్‌నాయుడు, పీఎల్ రావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మనుబోలు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. పోటీల్లో డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో మనుబోలుకు చెందిన గాంధీ, భరత్ జట్టు విజేతగా నిలిచింది. వీరికి రూ.6 వేలు నగదు ప్రోత్సాహకంతో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా కె.శ్రీనివాసులు, శ్రీను నిలిచారు. సింగిల్స్‌లో భరత్ విజేతగా, చంద్రకుమార్ రన్నరప్‌గా నిలిచారు. ఎస్సై రాకేశ్ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

కరకట్టలకు గండ్లు.. ప్రజలకు పాట్లు

పెన్నాకు వరదొస్తే జల దిగ్బంధమేనని స్థానికుల్లో ఆందోళన

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్ద నెల్లూరు బ్యారేజి సమీపంలో సుమారు రూ.6 కోట్లతో నిర్మించిన పెన్నా కరకట్టలు అధ్వానంగా ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో చేసిన పనులు నాసిరకంగా ఉన్నాయి. గుత్తేదారుడి నిర్వాకంతో ఏడాదిన్నరకే కరకట్టలు భారీగా పగుళ్లు వచ్చాయి. నిబంధనల మేరకు పెన్నానదిలో నీటి ప్రవాహానికి కట్టలు కొట్టుకుపోకుండా రాళ్లతో రివిట్‌మెంటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. పెన్నానదికి వరదొస్తే కొట్టుకుపోయి జలదిగ్బంధం ఖాయమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోవూరు మండలంలోని జమ్మిపాళెం వద్ద పెన్నా కరకట్టల వద్ద మట్టిని అక్రమార్కులు ధ్వంసం చేశారు. రాత్రి సమయాల్లో ఇసుక అక్రమంగా తరలిచేందుకు దారి ఏర్పాటు చేసుకున్నారు. రేయింబవళ్లు ఇసుకను తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. బుచ్చి మండలం మినగల్లు నుంచి విడవలూరు మండలంలోని ఊటుకూరు వరకు పెన్నానది సముద్రంలో కలిసే వరకు కరకట్టలకు సుమారు 60 చోట్ల గండ్లు పడ్డాయి. ఇసుక, మట్టి తరలించేందుకే గండ్లు వేశారు. ప్రతి నాలుగు కిలోమీటర్లకు ఒక చోట పెన్నాకరకట్టలకు గండ్లు పడటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



న్యూస్‌టుడే, కోవూరు

కోవూరు నియోజకవర్గంలో పెన్నానది కరకట్టల దుస్థితి అధ్వానంగా ఉంది. పరివాహన మండలాలైన ఆత్మకూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ మండలాల్లో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయిదేళ్లలో పెన్నానదికి మూడేళ్లు వరుసగా భారీగా వరదలొచ్చాయి.

భారీగా వరద రావడంతో..

2022లో పది లక్షల క్యూసెక్కుల వరద రావడంతో కరకట్టలకు 24 చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. సంగం మండలంలోని సిద్ధీపురం, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి, కాళాయకాగొల్లు, దామరమడుగు.. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు, ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరుతో పాటు కోవూరు పట్టణం... విడవలూరు మండలంలోని ముదివర్తి, ఊటుకూరు... ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు, నిడిముసలి, నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండ, నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీల్లోకి వరదనీరు రావడంతో పది రోజులపాటు నీటిలో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆరు మంది మృతిచెందగా వేలాది పశువులు మృత్యువాత పడ్డాయి.

● వందలాది ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయి, ఇసుకమేటలు వేశాయి. ముంబయి, ఎన్‌హెచ్-16 జాతీయ రహదారులకు దామరమడుగు-రేబాల మధ్య, కోవూరు- వెంకటేశ్వరపురం వద్ద భారీగా గండ్లు పడ్డాయి. పడుగుపాడు రైల్వే లైన్ వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. కోవూరు చెరువుకు ఆరో చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెన్నానదిలో కరకట్టలు బలంగా ఉంటే ఇంతటి విపత్తు ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైకాపా పాలనలో జరిగిన పెన్నానది కరకట్ట చేసిన పనులను సమీక్షించి, కట్టలు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ నివేదిక అడిగారు..

– వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

కోవూరు నియోజకవర్గ పరిధిలో పెన్నానది కరకట్టలకు పలుచోట్ల గండ్లు పడిన విషయంపై కలెక్టరు ఆనంద్‌కు రాతపూర్వకంగా తెలియజేశాం. ఆయన స్పందించి ఆర్డీవోను పెన్నా కరకట్టలను తనిఖీ చేసి నివేదిక కోరారు. మరోసారి కలెక్టరుతో మాట్లాడి పెన్నానది కరకట్టల బలోపేతానికి తగు చర్యలు తీసుకుంటాం.

చేజర్లలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

చేజర్ల,న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా చేజర్లలో ఆదివారం యువత రక్తదాన శిబిరం నిర్వహించింది. రెడ్‌క్రాస్, ఆదివాసీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.పెంచలపుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన శిబిరంలో పలు గ్రామాలకు చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. మోటీవేటర్లు విజయ్, మహేష్, వెంకయ్య, సుధాకర్, హరీష్, గోపీ పాల్గొన్నారు.

విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలు


మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఆలయంలో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారి దంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. మునిరామయ్య, మధుసూదనమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

పట్టించుకునేదెవరు

నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో జాతీయ రహదారిపై చెత్త పేరుకుపోతోంది. దీంతో పాటు కసుమూరు రోడ్డు, సర్వేపల్లి మార్గంలో రైల్వే గేటు సమీపంలో చెత్త పేరుకుపోతున్నా తరలించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తూ వెళుతున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా చెత్త తరలిస్తామన్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం



రూ.కోట్ల ఆదాయం.. అసౌకర్యాలకు నిలయం



నెల్లూరు నుంచి కూతవేటు దూరంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం నిర్మించిన పురాతన భవనం కావడంతో భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్లు, ఇతర పనుల కోసం వచ్చే వారికి తాగునీటి సౌకర్యం, సరిపడ కుర్చీలు, బల్లలు లేవు. కార్యాలయ భవనం మీద చెట్లు మొలవగా, కిటికీలు అధ్వానంగా ఉన్నాయి. మరుగు దొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

కమ్మేసిన కంపచెట్లు

బుచ్చి మండలంలోని దామరమడుగు వద్ద పెన్నానది కరకట్టల మీద కంపచెట్లు ఏపుగా పెరగడంతో కరకట్టలు బలహీనంగా మారుతున్నాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో కనీసం ఒక్కసారి కూడ పెన్నా కరకట్టలపై జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదని రైతులు చెబుతున్నారు. భారీగా కంపచెట్లు పెరిగిపోవడంతో వరదలకు గండ్లు పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పెన్నాకరకట్టల సమీపంలో పొలాలకు వెళ్లేదారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం



కబడ్డీ విజేత లక్ష్మీపురం



దసరా సందర్భంగా విడవలూరు మండలంలోని లక్ష్మీపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం హోరాహోరీగా జరిగాయి. లక్ష్మీపురం జట్టు ఉత్తమ ప్రతిభ చూపి మొదటి బహుమతి గెలుచుకోగా, రెండు, మూడు, నాలుగు, ఐదు బహుమతులను బుచ్చి, అరకాడు, వాతంబేడు, సుబ్బు ఫ్రెండ్స్ జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, తెదేపా నాయకులు రంగంగారి పోలిరెడ్డి, కృష్ణపట్నం చిట్టిబాబు, ఆవుల వాసు, బక్తాని శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

ఐక్యత, క్రమశిక్షణకు మారుపేరైన మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. కృష్ణపట్నం ఆర్కాట్‌పాళెంలో కాపుల పట్టాభిషేకం కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. మత్స్యకారులపై ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతున్నామన్నారు. బీపీసీఎల్ పైపులైన్ గ్రామం మధ్యలో నుంచి కాకుండా వేరే భూముల్లో వేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. కొత్తగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. – న్యూస్‌టుడే, ముత్తుకూరు



జగజ్జనని.. అభయ ప్రదాయిని


ఆత్మకూరులో..


చేజర్లలో..


మర్రిపాడులో..


మనుబోలులో..


అలగానిపాడులో ..


విడవలూరులో ..

బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, కోవూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, పొదలకూరు, రాపూరు, సైదాపురం, కలువాయి, ఆత్మకూరు, సంగం, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లోని పలు ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చారు. కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డి జొన్నవాడ కామాక్షితాయిని విజయదశమి పర్వదినాన దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. కోవూరులోని గ్రామదేవత నాగావరపమ్మ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. మనుబోలు మండలం దేవాంగులవీధిలో కొలువుదీరిన పోలేరమ్మ ఆలయంలో భద్రకాళీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరు మండలం పెంచలకోనలో అశ్వవాహన సేవ, పారువేటవేడుకగా నిర్వహించారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, విడవలూరు, కలువాయిలో గ్రామోత్సవాలు కనువిందుగా జరిగాయి. ఆత్మకూరు పట్టణంలో ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చేజర్లలో పోలేరమ్మ, ఆదూరుపల్లిలో దుర్గాదేవి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.


కోవూరులో..


దాచూరులో..


పెంచలకోనలో..


సంగంలో పూజలో పాల్గొన్న మహిళలు

తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, చేజర్ల, అనంతసాగరం, సంగం, విడవలూరు: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం చేయాలని ఆర్డీవో పావని రెవెన్యూ, పోలీసు శాఖాధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్తగా సోమశిల జలాశయం నుంచి పెన్నానదిలోకి నీటివిడుదల ఆపేశారు. ఉత్తరకాలువకు విడుదల చేసే నీటిని 200క్యూసెక్కులకు తగ్గించి దక్షిణ కాలువకు నీటివిడుదలను పూర్తిగా ఆపేశారు. అత్యవసర సామగ్రి సిద్ధం చేసుకుని భద్రపరుచుకోవాలని ప్రజలకు చేజర్ల తహసీల్దారు మస్తానయ్య సూచించారు. గ్రామాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు. పెన్నాతీర గ్రామాల్లో నదికి వెళ్లేదారులను మూసేశారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతసాగరం మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవో మస్తాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని, సంగం తహసీల్దారు సోమ్లానాయక్ పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో తుపాను, భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ సూచించారు. ఆదివారం విడవలూరు మండలంలోని ఊటుకూరు తీర ప్రాంతంలో పర్యటించి తుపాను షెల్టర్లను పరిశీలించారు.

అభివృద్ధి పనుల శంకుస్థాపనలు వాయిదా

సైదాపురం, న్యూస్‌టుడే: సైదాపురం మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జరగాల్సిన పల్లెపండగ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎంపీడీవో శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

సీపీఎం ప్రాంతీయ కార్యదర్శుల ఎన్నిక

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సీపీఎం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో ప్రాంతీయ కార్యదర్శులను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావుపల్లి ప్రాంతీయ కార్యదర్శిగా పురపాలక మాజీ వైస్ ఛైర్మన్ సందానీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కోవూరు:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే కమ్యూనిస్టుల లక్ష్యమని ఆ పార్టీ జిల్లా నాయకులు వెంకమరాజు అన్నారు. కోవూరులో సీపీఎం మండల నాలుగో మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు తక్షణమే వాటిని అమలు చేయాలన్నారు.

ఆటోని ఢీకొన్న బస్సు.. ముగ్గురికి గాయాలు

సంగం: కొరిమెర్ల గ్రామ పరిధిలో సంగం- కలిగిరి రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సు ఆటోని ఢీకొనడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పాపూరు నుంచి నెల్లూరు వెళుతున్న బస్సు ఆటోని అధిగమించే క్రమంలో ఢీకొంది. ఆటోలో ఉన్న కొరిమెర్ల గ్రామవాసులు వి.చిన్నపెంచలయ్య, ఈశ్వరమ్మ, డి.మస్తానయ్యకు గాయాలయ్యాయి. సంగంలో ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో గొడవ.. కేసు నమోదు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని టిడ్కో గృహ సముదాయంలో మద్యం మత్తులో గొడవకు దిగిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ గంగాధర్‌రావు తెలిపిన వివరాల మేరకు గృహసముదాయంలో ఉంటోన్న గోవింద్ అనే వ్యక్తి తాగిన మత్తులో తన తండ్రితో గొడవ పడ్డారు. ఆపై స్థానికులతో వాగ్వాదానికి దిగారు. అతని తీరు భరించలేక వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జూద స్థావరాలపై దాడులు

ఆత్మకూరు: మండలంలోని బట్టేపాడులో కోడి పందెం స్థావరంపై ఆదివారం ఆత్మకూరు సీఐ గంగాధర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. రెండు కోళ్లు, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.
వెంకటాచలం: మండలంలోని కాకుటూరు సమీపంలో అడవిలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై వెంకటాచలం పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అయిదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఫ్లెక్సీలు కట్టారని వివాదం

కోవూరు,న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని స్టాబీడీకాలనీలో తమ ఇంటి ఎదుట ఫ్లెక్సీలు కట్టారనే కోపంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఇరువర్గాలకు చెందిన పలువురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని పోలీసులు చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు వారిని హెచ్చరించారు. ఘర్షణకు కారణమైన వారిని గ్రామ పెద్దలు మందలించడంతో సర్దుబాటు చేసుకున్నారు.

దసరా మామూళ్ల దందా

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు మండలంలో విద్యుత్తుశాఖ సిబ్బంది దసరా పండగ నేపథ్యంలో మామూళ్లు వసూలు చేసినట్లు సమాచారం. ఇంటికి, దుకాణాలకు, రొయ్యల చెరువులకు ఇలా ఒక్కోదానికి ఒక రేటు నిర్ణయించి ముక్కుపిండి వసూలు చేసినట్లు సమాచారం. చేసేదేమీ లేక, బయటకు చెబితే ఏమవుతుందోనని గుట్టుగా అడిగినంత సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు విచారించాలని పలువురు కోరుతున్నారు.

తెదేపా నాయకుడి మృతికి నివాళి



పొదలకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన తెదేపా మండల మాజీ అధ్యక్షులు, రాపూరు మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ **వెంపులూరు పుల్లయ్య గౌడ్** అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ...పద్నాలుగు సంవత్సరాలు తెదేపా మండల అధ్యక్షులుగా పనిచేశారన్నారు. జిల్లా బీసీ సంఘ ఉపాధ్యక్షుడిగా కొనసాగారన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

అక్రమ కేసులకు భయపడం

పొదలకూరు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వాటికి భయపడేది లేదని మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. పొదలకూరు మండలంలోని నావూరు, బత్తులపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి మాట్లాడారు. జమిలి ఎన్నికల నేపథ్యంలో 2027లో సాధారణ ఎన్నికలు వచ్చే అవకాశముందని పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు.

మనుబోలు: వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండల వైకాపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి, జట్లకొండూరు ఉపసర్పంచి ఆవుల తులసీరామ్ తదితరులు నెల్లూరులోని కాకాణి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

వసతి గృహాలకు పూర్వ వైభవం వచ్చేనా..?

న్యూస్‌టుడే, విడవలూరు

వైకాపా పాలనలో విద్యాశాఖకు ఎంతో చేశామని ప్రతి సమావేశంలో ప్రజాప్రతినిధులు ఊదరగొట్టే ఉపన్యాసాలిచ్చారు... ఏ ప్రభుత్వం చేయలేదని తరచూ గొప్పలు చెప్పుకున్నారు.. ఎన్నికల అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. గత తెదేపా హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో పెరటి తోటలు ఏర్పాటు చేసి వాటి ద్వారా వచ్చే కూరగాయలతో విద్యార్థులకు రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలు వడ్డించాలని సంబంధిత అధికారులకు సూచించారు.. అప్పుడు చాలా చోట్ల అమలు చేయడంతో ఉపయోగకరంగా సాగింది.

● 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత వసతి గృహాల నిర్వహణ గాలి కొదిలేసింది. కనీస వసతుల్లేక అధ్వానంగా మారడంతో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల ఆసక్తి చూపలేదు. కొన్ని చోట్ల వసతుల్లేక మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాల్లో పెరటి తోటల పెంపకంపై ఆశలు చిగురించాయి. పూర్వవైభవం వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.


విడవలూరులో బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా ఖాళీ స్థలం

● విడవలూరు మండలంలో విడవలూరు, రామతీర్థం, లక్ష్మీపురంలో వసతి గృహాలున్నాయి. అప్పట్లో రామతీర్థం, విడవలూరు వసతి గృహాల్లో పెరటి తోటలు పెంచేవారు. పర్యవేక్షకులు సొంత ఖర్చులతో ప్రత్యేక శ్రద్ధతో పెరటి తోటల్లో ఆకు కూరలు, సొరకాయ, పొట్లకాయ, బీర కాయలు, వివిధ రకాల పూల మొక్కలు సేంద్రియ పద్ధతిలో పండించారు.

● అయిదేళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సిబ్బందిని నియమించకపోవడంతో పెరటి తోటల పెంపకంపై పర్యవేక్షకులు ఆసక్తి చూపలేదు. ఒక్కొక్కరికి రెండు, మూడు చోట్ల వసతి గృహాల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వారి భారంగా మారింది. తాజాగా ప్రభుత్వం దృష్టిసారించి అధికారులకు దీనిపై దిశానిర్దేశం చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించి పూర్వవైభవం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కోరుతున్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారంతోపాటు, వసతి గృహాలపై ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారుల వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమావేశం

నెల్లూరు (బీవీ నగర్), న్యూస్‌టుడే: నగరంలోని వెంకటేశ్వరపురం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఓ కన్వెన్షన్ సెంటరులో జరిగింది. 1996-2001వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలిశారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పాటూరు శ్రీనివాసులు మాట్లాడుతూ నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు గుర్తుంచుకోవడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో ఏసీ నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులైన మేడికొండూరు ఇన్‌స్పెక్టర్ నాగూరు మీరాసాహెబ్, తెదేపా డివిజన్ అధ్యక్షుడు షేక్ షాహిద్, జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, విజయ్‌భాస్కర్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి సిస్టర్స్‌కు దత్తపీఠ 'ఆస్థాన విదూషి' బిరుదు ప్రదానం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: చిన్న వయసులోనే సంగీత విద్వాంసులుగా రాణిస్తున్న నెల్లూరుకు చెందిన సర్వేపల్లి సిస్టర్స్ (వైద్యుల శ్రేయ, రాజలక్ష్మి) మైసూరు దత్తపీఠం 'ఆస్థాన విదూషి' బిరుదును అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకల్లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవవర్మ, దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారికి బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో దత్తపీఠ ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థస్వామీజీ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవవర్మ, దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీతో బిరుదును అందుకున్న సర్వేపల్లి సిస్టర్స్

అమ్మ వైభవం.. పులకించిన భక్తజనం



నవాబుపేట కుమ్మరి వీధిలో నగరోత్సవం.. విరాట్‌నగర్‌లో గాయత్రి అమ్మవారికి అన్నపూర్ణ అలంకరణ.. వేదాయపాలెం వైభవలక్ష్మికి విజయలక్ష్మి అలంకరణ.. ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే

విజయదశమి వేడుకల్లో అమ్మ వారిని చూసి భక్తులు పులకించిపోయారు. దర్గామిట్టలోని రాజరాజేశ్వరికి శనివారం తెల్లవారు జామున దేవస్థానం ప్రధానార్చకులు రఘురామమూర్తి అభిషేకాలు చేశారు. విశేష అలంకారంలో నగరోత్సవంలో ఊరేగారు. గర్భాలయంలో బంగారు చీర అలంకారంలో భక్తుల పూజలు అందుకున్నారు. ఆదివారం అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో జనార్దన్‌రెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాం పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్త ఆల్తూరు గిరీష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కమనీయం కన్యకాపరమేశ్వరి నగరోత్సవం

విద్యుద్దీప కాంతులు, విశేష పుష్పాలంకరణ, బ్యాండు మేళాలు, బాణసంచా మోతల నడుమ కన్యకాపరమేశ్వరి నగరోత్సవం సందడిగా సాగింది. మహిళలు దీపాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆదివారం వసంతోత్సవం నిర్వహించారు. అమ్మ వారు బంగారు చీర అలంకారంలో దర్శనమిచ్చారు. మూలాపేట ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో భక్తులు బారులుదీరారు. సాయంత్రం ఇరుకళల పరమేశ్వరి అలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. నవాబుపేట కుమ్మరివీధిలో శంకర్‌స్వామి ఆధ్వర్యంలో నగరోత్సవం నిర్వహించి పెన్నా నదిలో నిమజ్జనం చేశారు. మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో భువనేశ్వరీదేవికి శమీ పూజ ఏర్పాటుచేశారు. బాలాజీనగర్ సీతారామ మందిరంలో సీతాదేవి, విరాట్‌నగర్‌లో గాయత్రి దేవి, వేదాయపాలెం శ్రీకృష్ణ మందిరంలో వైభవలక్ష్మి అమ్మ వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యులు, భక్తమండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కాళికామాతకు మహా పూజలు

నెల్లూరు (జడ్పీ): జొన్నవాడ మార్గంలో దొడ్ల పాలెం సమీపంలో కాళికామాత కాళేశ్వర ఆలయంలో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ పీఠాధిపతి అచలరుషి ఆధ్వర్యంలో ఊరేగింపు చేపట్టారు. మూలాపేట నీలకంఠేశ్వర ఆలయంలో పాలకమండలి ఛైర్మన్ యడవల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కంచికామాక్షి తాయి దేవస్థానం, ఫత్తేఖాన్‌పేట వరసిద్ధి వినాయక, వనంతోపు ఉన్న కాంతమ్మ ఆలయాల్లో వేడుకగా జరిగాయి. కొత్తూరులో వెంకయ్య స్వామి ఆశ్రమంలో నిర్వాహకులు ఆనందస్వామి ఆధ్వర్యంలో గజవాహనంపై అమ్మ వారిని ఊరేగించారు.

పరిధి ఎక్కువ.. స్టేషన్లు తక్కువ

➡ వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని బీవీ నగర్‌లో అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని గతంలో పోలీసు అధికారులు భావించారు. స్టేషన్ పరిధి ఎక్కువ కావడంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. నేటికి కార్యరూపం దాల్చలేదు.

➡ నెల్లూరుగ్రామీణం పరిధిలోని అల్లీపురం టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయకుమార్ ఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. సాధికారంగా శాంతిభద్రతల పరిరక్షణకు అవుట్‌పోస్టు అవసరమని ఆయన తెలిపారు.



న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

నెల్లూరు నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇతర ప్రాంతాల వారు ఉపాధి కోసం నగరానికి రావడంతో జనాభా పెరుగుతోంది. [illegible] విస్తరిస్తోంది. నేరాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. పోలీసు స్టేషన్లు ఉన్నా.. శాంతి భద్రతలు గాడి తప్పుతున్నాయి. శివారు ప్రాంతాలు అధికం కావడంతో నేరాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది.

రెండు స్టేషన్ల పరిధి ఎక్కువే..

నగరంలో చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీసు స్టేషన్లతో పాటు నెల్లూరుగ్రామీణం పోలీసు స్టేషన్ ఉంది. ఇవి కాకుండా ట్రాఫిక్ రెండు, సీసీఎస్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. నగరంలో దాదాపు 9 లక్షల జనాభా ఉండగా.. 1.80 లక్షల కుటుంబాలు ఉన్నాయి. వేదాయపాలెం, నెల్లూరుగ్రామీణ పోలీసు స్టేషన్లు అంటే పోలీసులు భయపడతారు. ఇక్కడ పని చేయాలంటే కత్తి మీద సామే. నగరంలోని ఏ పోలీసుస్టేషన్‌కు లేని పరిధులు ఉండటమే ఇందుకు కారణం. దాంతో పాటు వీటికి శివారు ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి.



పరిధి ఎక్కువగా ఉన్న వేదాయపాలెం పోలీస్‌స్టేషన్

అవుట్ పోస్టులపై ఆశలు

శివారులోనే సమస్య

శివారు ప్రాంతాల్లో ఎక్కువగా వివాదాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉండే కొందరు ఆకతాయిలు, యువకులు, మందు బాబులు నిత్యం గొడవలు చేస్తున్నారు. మద్యం మత్తులోహత్యాయత్నాలు, హత్యలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలోనే స్థానికంగా ఓ అవుట్ పోస్టు ఉంటే కొంతవరకు అదుపులో ఉంటారు. వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డి కాలనీలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నారు. స్థానికంగా శాంతి భద్రతల పరిరక్షణ నేపథ్యంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ చొరవ తీసుకుని ఇక్కడ పోలీసు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. స్థానికంగా పోలీసు అవుట్ పోస్టు ఉంటే 24 గంటలు పోలీసులు విధులు నిర్వర్తిస్తుంటారు. హెడ్ కానిస్టేబుల్‌తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటారు. వివాదాలు జరిగే చోట అవుట్ పోస్టులు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని నగరవాసులు తెలిపారు.

పూల ధరలకు రెక్కలు

దసరా పండగ సందర్భంగా పూల ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని పూల మార్కెట్లో కనకాంబరం కిలో రూ.1500 నుంచి రూ.2 వేల వరకు పలికాయి. కాగడా మల్లెలు కిలో రూ.1000, రోజా పూలు రూ.400, చామంతి రూ.350, సంపెంగ రూ.200, బంతి రూ.100 చొప్పున అమ్మకాలు సాగాయి. **- నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే**





తెదేపాలో వైకాపా నాయకుల చేరిక

నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని 27వ డివిజన్‌కు చెందిన వైకాపా నాయకులు మాజీ కౌన్సిలర్ వేణుంబాక సుధాకర్ రెడ్డి, కుమార్, చలపతి, భాస్కర్ తమ మిత్రబృందంతో కలసి ఆదివారం తెదేపాలో చేరారు. నగరంలోని మాగుంటలేఅవుట్‌లో తెదేపా కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భీమినేని మురహరి, ఉప్పు భాస్కర్, అలహరి విజయ్, రాజా అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రైమ్ హాస్పిటల్ ప్రారంభం

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని మినీబైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైమ్ హాస్పిటల్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఆదివారం ప్రారంభించారు. ఆసుపత్రిలో అందించే సేవలను మెడికల్ టీం డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, టి.వి.నాగరాజు, కె.వి.అజిత్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ధ్రువపత్రాలతో రావాలి

వెంకటాచలం : వీఎస్‌యూలో నేటి నుంచి స్పాట్, మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్లు హనుమారెడ్డి, సాయినాథ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ అర్హత సాధించిన వారితో పాటు, రాయని అభ్యర్థులు కూడా సంప్రదించవచ్చన్నారు. వీటితో పాటు పీహెచ్‌డీ సీటు పొందిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో 19లోగా వీఎస్‌యూలో రిపోర్టు చేయాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: రామచంద్రారెడ్డినగర్ నాలుగో వీధిలో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు ముందుకు కదలడం లేదు. **- సుబ్బమ్మ, స్థానికురాలు**

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం. **- డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి**

? నీలగిరి సంఘంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలో ఉండలేకున్నాం. **- సుహాసిని**

✓ దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి**

- నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో వసతులు కల్పిస్తాం

విడవలూరు ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం వద్ద మైపాడు మార్గం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం తెదేపా నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ మైపాడు రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా కేంద్రం నుంచి నిధులు సాధించడంలో కల్యాణ్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. రోడ్డు పూర్తయితే రైతులు, భక్తులు, పర్యాటకులు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.64 కోట్లతో అంచనాలు రూపొందించామని త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 'పల్లె పండగ' కార్యక్రమం ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో సమస్యలను గుర్తించి అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. కార్యక్రమంలో వీరేంద్ర నాయుడు, సురేష్‌నాయుడు, పీఎల్ రావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధు గ్యాస్ట్రో ఆసుపత్రి ప్రారంభం

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని విజయమహల్ గేటు వద్ద జనరల్ ఫిజీషియన్ డాక్టర్ డి.మధుసూదన్, డాక్టర్ రేణుకాదేవి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మధు గ్యాస్ట్రో ఆసుపత్రిని ఆదివారం పలువురు ప్రారంభించారు. తెలంగాణ మాజీ డీజీపీ, విశ్రాంత ఐపీఎస్ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎమ్.పెంచలయ్య, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు పి.వి.రజనీకాంత్, నీరజాపాట్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న విశ్రాంత ఐపీఎస్ జె.పూర్ణచంద్రరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య

డంపింగ్ యార్డు పరిశీలన

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ కృష్ణయ్య ఆదివారం అల్లీపురంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం ఎస్‌టీపీని తనిఖీ చేసి సిబ్బందిని అడిగి పనితీరు తెలుసుకున్నారు. ఆ తరువాత పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంతంలోని వెహికల్ షెడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఈఈ జానీ, ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ, ఛైర్మన్ కృష్ణయ్య


పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేత

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని 14వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు ఆ డివిజన్ కార్పొరేటర్, వికాస్ ప్రజాహిత సేవా సమితి వ్యవస్థాపకులు కర్తం ప్రతాపరెడ్డి దుస్తులు అందజేశారు. శనివారం బాలాజీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో డివిజన్‌లో పారిశుద్ధ్యం మెరుగుకు పాటుపడుతున్న వీరికి వస్త్రాలు అందించామన్నారు.



కార్మికులకు దుస్తులు అందిస్తున్న కర్తం ప్రతాపరెడ్డి

బాబాకు నక్షత్ర హారతి



బాబాకు నక్షత్ర హారతుల సమర్పణ

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న అద్దాల సాయి బాబా మందిరంలో శనివారం భక్తులు బాబా నామస్మరణలో పులకించారు. బాబాకు ప్రత్యేక అభిషేకాలు, అఖండ సాయి నామ సంకీర్తనల నడుమ మహాసమాధి ఉత్సవాలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో నక్షత్ర హారతి సమర్పించారు. 306 జ్యోతుల ప్రజ్వలన, సత్సంగం, సమాధి కీర్తనల గానం జరిగింది. సాయంత్రం బాబాకు పల్లకి ఉత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు. మందిర ఛైర్మన్ మధుసాయి పర్యవేక్షణలో భక్తులకు మధ్యాహ్నం భోజన ప్రసాదాలను అందజేశారు. ఆదివారం ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా సామూహిక పారాయణం జరిగింది.

దేశికర్ల తిరునక్షత్ర మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం): రంగనాయకులపేటలోని వేదాంత దేశికర్ల దేవస్థానంలో తిరునక్షత్ర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి శేషవాహనంపై, వేదాంత దేశికర్లకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణం, వేదగోష్ఠి, పలు ప్రాంతాలకు చెందిన ఆచార్యులకు మంగళాశాసనాలు సమర్పించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కేసీ వరదరాజన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.



వేదాంత దేశికర్ల పల్లకి ఉత్సవం

ఆదమరిచేలా చేసి.. దోచేసి..

అయిదుగురు అంతర్ జిల్లాల నేరస్థులు అరెస్ట్

గండేపల్లి, న్యూస్‌టుడే: అంతర్ జిల్లాలకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని పట్టుకుని వారి నుంచి విలువైన బంగారు అభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మహిళ ఈనెల 7వ తేదీన పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చారు. అనంతరం ఆమె ఆటో ఎక్కి మురారి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా అదే ఆటోఎక్కిన మరో మహిళ ఈమెతో మాటలు కలిపి బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దోచుకుంది. దీనిపై ఈనెల 11న గండేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గతో పాటు అదే ప్రాంతానికి చెందిన మెరకనపల్లి వెంకటేశ్వరరావు, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి, అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, గోకవరం డ్రైవర్స్‌కాలనీకి చెందిన నాగులూరి శివపార్వతిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు అభరణాలు, కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు గతంలో విశాఖ, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. గండేపల్లి ఎస్సై శివనాగబాబు, ఏఎస్సై శేఖర్, సిబ్బంది వీరబాబు, సూరిబాబు, బాషా ఉన్నారు.

ప్రభుత్వమే ఇసుక అందించాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : ఇసుక రీచ్‌లు లేని ప్రాంతాల్లో ప్రభుత్వమే ప్రజలకు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కోరారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇసుక దొరకక సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. స్థానిక నాయకులు అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు షానవాజ్, సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



బురదలోనే వినియోగదారులు కొనుగోలు

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)


జిల్లాలో అతి పెద్దదైన ఏసీ కూరగాయల మార్కెట్ లోపలకు అడుగు పెడితే దుర్గంధం వస్తోంది. చినుకు పడితే చిత్తడే. బురదలోనే కొనుగోలు చేస్తున్నారు. ఎకరా ప్రాంగణంలో వందకుపైగా హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ప్రతిరోజూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దుకాణదారులు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తీసుకెళ్లి రిటైల్‌గా విక్రయిస్తుంటారు. సమీపంలోనే మరో చిన్న మార్కెట్ ఉంది. ఇంత ప్రధానమైన మార్కెట్ల నిర్వహణను అధికారులు విస్మరించారు.

తెరచుకోని చిన్న మార్కెట్

చిన్న మార్కెట్‌లో కూరగాయల వ్యాపారానికి గత తెదేపా ప్రభుత్వంలో వందకుపైగా షాపులు నిర్మించారు. వాటిని అద్దెకు ఇవ్వకపోవడం.. రోడ్లపైనే వ్యాపారాలకు నగరపాలకసంస్థ అధికారులు ప్రోత్సాహం వల్ల దుకాణాలు నిరుపయోగంగా మారాయి. షాపుల షట్టర్లు తుప్పుపట్టాయి. రోడ్లపైనే వ్యాపారాలు చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొద్దిపాటి వర్షానికి రెండు మార్కెట్లు చిత్తడిగా మారుతున్నాయి. బురదగా మారి దుర్వాసనకు వినియోగదారులు, దుకాణాల యజమానులు ఉండలేకపోతున్నారు. అధికారులు స్పందించి మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు.

నడవలేని పరిస్థితి

– మధుసూదన్‌రావు, వినియోగదారు



మార్కెట్‌లో నడిచేందుకు కూడా వీలు పడటం లేదు. దుర్వాసన వస్తోంది. పశువులు మార్కెట్‌లో తిరుగుతుండటంతో భయమేస్తోంది. బురదలో నడవాల్సి వస్తోంది. కుళ్లిపోయిన కూరగాయలు దిబ్బగా పోస్తున్నారు.

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు

– సుబ్బమ్మ, వ్యాపారి



మార్కెట్ పక్కనున్న అన్న క్యాంటీన్ నీరు పోయేందుకు తవ్వారు. పట్టించుకోలేదు. నగరపాలకసంస్థ అధికారులకు ఫిర్యాదు చేశాం. వారు చర్యలు తీసుకోలేదు. వాసనతో వ్యాపారం చేసుకోలేకపోతున్నాం. బురదతో ఇబ్బందులు పడుతున్నాం.

ఎంపీ వేమిరెడ్డితో పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులను నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని వారి నివాసంలో కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర ఛైర్మన్ పి.కృష్ణయ్య ఆదివారం సన్మానించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వేణుగోపాల్ భేటీ అయ్యారు.

జానీమాస్టర్ తల్లికి గుండెపోటు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తల్లి బీబీజాన్‌కు శనివారం గుండెపోటు రాగా హుటాహుటిన కుటుంబ సభ్యులు నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జానీ మాస్టర్ భార్య, బంధువులు నెల్లూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జానీ మాస్టర్ భార్య సుమలత మాట్లాడుతూ కుమారుడిపై బెంగతోనే గుండెపోటు వచ్చినట్లు తెలిపారు. తప్పుడు కేసులో తన భర్తను జైలుకు పంపించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డుపై బంగారు గొలుసు

బాధితులకు అందజేసిన ఎక్సైజ్ సీఐ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రోడ్డుపై పడి ఉన్న బంగారు గొలుసును గుర్తించిన ఎక్సైజ్ సీఐ బాధితులకు అందజేసిన వైనమిది. ఓవెల్ స్కూలు కరెస్పాండెంట్ వేణు నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె శనివారం అన్నమయ్య సర్కిల్ వద్ద స్కూటీ నేర్చుకుంటుంది. ఈ క్రమంలో ఆమె మెడలోని బంగారు గొలుసు కిందపడిపోయింది. ఈ విషయం గుర్తించని ఆమె ఇంటికి వెళ్లిపోయింది. మెడలో గొలుసు లేకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నమయ్య సర్కిల్ వద్దకు చేరుకుని వెదుకుతున్నారు. ఈ క్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరహరి అన్నమయ్య సర్కిల్ వద్ద వాకింగ్ చేస్తుండగా రోడ్డుపై ఉన్న బంగారు గొలుసును గుర్తించి తీసుకున్నారు. అక్కడ వెదుకుతున్న బాధితులకు అందజేశారు.